# పిచ్చి ప్రశ్నలు - పిచ్చి జవాబులు

1986లో అనుకుంటాను. నేను శెలవ మీద ఇండియాకి వెడుతున్నాననీ, మా ఫ్లైట్ డల్లాస్‌నించి, పారిస్ మీదుగా బొంబే వెడుతుందనీ చెప్పగానే, చాల అమాయకంగా అడిగాడు మిత్రుడు రిక్కీ, "బొంబే నించి మీ ఊరికి ఎలా వెడతావ్? ఏనుగుల మీదా?" అని.

అతని మాటలకి నవ్వి "ఈ మధ్య ఇండియాలో గడ్డి ఖరీదు ఎక్కువయిందిట. అందుకని ఇక్కడి కార్ షేరింగ్ ప్రోగ్రాంలా అక్కడ ఎలిఫెంట్ షేరింగ్ ప్రోగ్రామ్ పెట్టారుట. ఫోన్ చేసి వివరాలు కనుక్కోవాలి" అన్నాను.

అతనికి నేను జోక్ చేస్తున్నానని అర్థమయి, తను వేరే ఉద్దేశ్యంతో అలా అనలేదని, సారీ చెప్పేసి, తనూ నవ్వేశాడు.

ఈమధ్య ఇంటర్‌నెట్లో ఇలాటివే కొన్ని చదివాను. ముఖ్యంగా అమెరికాలో పుట్టి పెరిగిన మన రెండో తరం పిల్లల జోకులు. అమెరికాలోని మొదటి తరం భారతీయుల్లా, విమర్శలకీ వివాదాలకీ దిగకుండా మెత్తగా వడ్డించటమలవాటయిన రెండో తరం, యువతరం, వాళ్ళు చెప్పే జోకులు.

ప్రపంచంలోని అన్ని దేశాలకి చెందినవారూ నివసించే ఒకే ఒక దేశం అమెరికా. ఇక్కడ కనపడే సంస్కృతులూ, వినపడే భాషలూ ఇంకెక్కడా వుండవనిపిస్తుంది అలా ఇన్ని రకాల మనుష్యుల మధ్య జీవిస్తున్నప్పుడు, చాలమందికి మిగతా జాతులవారిని చూస్తుంటే ఎంతో వింతగా వుండటంలో ఆశ్చర్యం లేదు. కొంతమంది తెలీక అమాయకంగా అడుగుతారు. కొంతమంది తెలీక తెలుసుకోవాలనే జిజ్ఞాసతో అడుగుతారు కొంతమంది తెలియకపోయినా తెలిసినట్టు వ్యంగ్యంగా అడుగుతారు. తెలిసినా తెలియకపోయినా కొంతమంది అవహేళనగా అడుగుతారు అలాటి వాటిలో కొన్ని జరిగినవీ, కొన్ని సరదాగా సృష్టించినవీ చెప్పుకుందాం. ఇవి కేవలం హాస్యం కోసం చెప్పుకునే కబుర్లు కాబట్టి, ఎవరి వేపూ వేలెత్తి చూపించకుండా, హాయిగా నవ్వుకుందాం.

"ఇండియాలో ఆడవాళ్ళు నుదుటి మీద చుక్క ఎందుకు పెట్టుకుంటారు"

"అదా! పూర్వకాలంలో, మగవాళ్ళు బాణాలు వేయటం నేర్చుకునేటప్పుడు, గురి కోసమని ఆడవాళ్ళ నుదుటిమీద అలా చుక్కపెట్టేవారు. ఆ చుక్కని గురిగా పెట్టుకుని సాధన చేశేవారు"

"మరి బాణం తగిలితే వాళ్ళు చచ్చిపోరూ?"

"అందుకనే ఒక్కొక్క మగాడికీ ఎంతోమంది భార్యలు వుండేవాళ్ళు ఆ

రోజుల్లో"

"మీ ఇండియాలో టీవీలు వున్నాయా?"

"లేవు. కేబులే వుంది"

"మి దేశంలో అందరూ శాకాహారులేట కదూ?"

"అవును. మనుష్యులే కాదు అక్కడ పులులు కూడా శాకాహారులే!"

"నువ్వు హిందీవా?"

"అవును. ఉత్తరభారత దేశంలో నన్నే మాట్లాడలారు"

"నువ్వు హిందూ మాట్లాడతావా?"

"అవును. నేను హిందూ మాట్లాడటమే కాదు. జ్యూయిష్, క్రిస్టియానిటీ, ఇస్లామ్ కూడా మాట్లాడగలను"

"మీ దేశంలో అందరూ లంచగొండులేట కదా?"

"అవును. నేను పుట్టటానికి కూడా మా అమ్మా నాన్నలకి లంచమివ్వాల్సి వచ్చింది"

"ఇండియాలో బాగా వేడిగా వుంటుందిట కదా?"

"ఎంత వేడంటే, ఎండలో పెట్టిన నీళ్ళు వెంటనే మరిగిపోతాయి. అందుకే అందరూ అక్కడ వేడి వేడి టీ తాగటం"

"మీ దేశంలో పరిశ్రమలు ఏమయినా వున్నాయా?"

"అస్సలు లేవు. గాంధీ సూత్రాల మీదే జనం బ్రతుకుతారు కదా. మేమంతా ఎవరి బట్టలు వాళ్ళే నేసుకుంటాం. మా బియ్యం, కూరగాయలూ మేమే పండించు కుంటాం. బాగా కష్టపడి పనిచేయాలి కదా! అందుకే మావాళ్ళంతా అంత సన్నగా వుంటారు"

"మి మతం చాల గొప్పదంటారు కదా. మరి అక్కడందరూ రోజా ధ్యాన్నం (మెడిటేషన్) చేస్తారా?"

"ఓ! తప్పకుండానూ! ఏమీ తినకుండా తాగకుండా కొన్ని వారాలలా ధ్యాన్నం చేయగలం. కానీ ఉద్యోగస్తులం. కుదరదు కదా. మేనేజర్లకయితే ఆఫీసులో కూర్చుని, రోజా కళ్ళు మూసుకుని ధ్యాన్నం చేసుకున్నా ఫరవాలేదు"

"నేను ఇక్కడ టీవీలో చూశాను. మీ దేశంలో జనం నిప్పుల మీద నడుస్తారెందుకు?"

"అక్కడ మాకు బూట్లు, చెప్పులు వుండవు అందుకని కాళ్ళ కింద చర్మాన్నిలా కాల్చేసుకుంటాం చర్మం గట్టి పడితే, ఇక చెప్పులతో పనేముంటుంది."

"ఒక్కొక్కప్పుడు ఇక్కడ మీరు ఇండియన్ బట్టల్ని కట్టుకుని ఆఫీసుకి వస్తారెందుకు?"

"ఛ! అస్సలు బట్టలు కట్టుకోకుండా ఎలా వస్తాం బాబూ!"

ఇలాటి చచ్చు ప్రశ్నలూ, పిచ్చి జవాబులూ అక్కడా ఇక్కడా వింటూనే వున్నాం. చదువుతూనే వున్నాం.

ఇలాటివి పరదేశీయులతోనే కాదు. కొంతమంది మనవాళ్ళుకూడా ఇలా

టి చచ్చున్నర ప్రశ్నలు వేస్తూనే వుంటారు.

ఢిల్లీ భాటియా అంటాడు, "మీ మద్రాసీ వాళ్ళంతా ఇంతే" అని.

"నేను మద్రాసీ వాడిని కాదు. పదహారణాల ఆంధ్రుడ్ని" అని చెబితే, ఆ మాటల్ని మొదటిసారిగా వింటున్నంత భంగిమ పెడతాడు. దక్షిణ భారత దేశంలో నాలుగు రాష్ట్రాలున్నాయనీ, అక్కడ నాలుగు భాషలకీ, గొప్ప సాహిత్యం, సంగీతం, సంస్కృతీ వున్నాయని, ఆ మహానుభావుడికి ఏ ఇస్కూల్లోనూ చెప్పలేదుట. అతనూ హిందీ న్యూస్ పేపర్లు తప్ప, ఇండియాలో వున్నప్పుడు ఇంగ్లీష్ పేపర్లు చదవలేదుట తనంత అజ్ఞానాంధకారంలో వుండటానికదే కారణమంటాడు.

ఇక్కడో జరిగిన చిన్న పిట్ట కథ ఒకటి చెప్పాలనివుంది.

మా వూళ్ళో భారత్ మెహ్రాగారింట్లో ఒక శనివారం సాయంత్రం పార్టీ జరిగింది. ఏదో ఒక పక్క ఓక్ వృక్షం క్రింద కూర్చుని, చల్లగాలి పీలుస్తూ, వేడి సమోసాలు తింటూ, స్వామినాథన్ చెబుతున్న కబుర్లు వింటూ కూర్చున్న నా దగ్గరికి వచ్చాడు అజయ్ పటేల్. వచ్చి తనని పరిచయం చేసుకున్నాడు. గుజరాతీలో ఏదో గుడగుడా చెబుతున్నాడు.

"అజయ్‌భాయ్' నాకు గుజరాతీ కానీ, హిందీగానీ పొట్ట కోస్తే ఒక్కఅక్షరం ముక్కకూడా రాదు. కాబట్టి ఇంగ్లీష్‌లో మాట్లాడు. అర్థమవుతుంది" అని మర్యాదగా చెప్పాను ఇంగ్లీష్‌లో.

"మీకు గుజరాతీ రాదా?" టపేల్‌మని అన్నాడు పటేల్. అనేటప్పుడు గుజరాతీ రాని మీరేం ఇండియన్సయ్యా అనుకుంటున్నట్టు అనిపించింది నాకు. అని మళ్ళీ గుజరాతీలో గుడా గుడా మాట్లాడటం కొనసాగించాడు. స్వామినాథన్ కూడా చెప్పి చూశాడు కానీ, పటేల్‌గారి ప్రలాపాలు ఆగటం లేదు

ఈసారి స్వామినాథన్‌కి కొంచెం కోపం వచ్చింది. అతనితో తమిళ్‌లో మాట్లాడటం మొదలుపెట్టాడు. ఏమిటేమిటో చెబుతున్నాడు. అజయ్ భాయ్ చిత్తర పోయాడు. ఏదో అన్నాడు గుజరాతీలో. స్వామినాథన్ మాటలు తమిళ్‌నాడ్ ఎక్స్‌ప్రెస్‌లా దడదడా ఎక్కడా ఆగకుండా దూసుకు వస్తున్నాయి.

అజయ్ గుజరాతీలోనించీ హిందీలోకి మారాడు. అయినా స్వామినాథన్ కావేరీ ప్రవాహం మాత్రం ఆగటం లేదు అజయ్ ఇంగ్లీష్‌లో మాట్లాడటం మొదలుపెట్టాడు. అయినా స్వామినాథన్ అతన్ని తమిళ్‌లో వాయించటం మాత్రం ఆపలేదు. అజయ్ ఒకసారి అటూ ఇటూ చూసి లేచి దూరంగా వెళ్ళాడు. అతనితో పాటూ వెళ్ళి అతనిలో ఏకధాటిగా తమిళ్‌లో మాట్లాడేస్తున్నాడు స్వామినాథన్. అది చూసి నాకు నవ్వు ఆగటంలేదు. ఇలా ఏడుగంటలకి మొదలైన స్వామినాథ భాగోతం రాత్రి పదయినా ఆగలేదు. అజయ్ ఎటు వెడితే ఆయనా అటు వెడుతున్నాడు. ఏదో చెబుతూనే వున్నాడు. భారత్ మెహ్రా భార్య ఆరతి, టీ పెడుతున్నాను వుండమన్నా ఆగకుండా, పనుందని చెప్పి వెళ్ళిపోయాడు అజయ్.

అతనికి అప్పుడర్థమయివుంటుంది బహుశా, మద్రాసీ అంటేఏమిటో.

* * *